- నారాయణ పాఠశాలకు తప్పుడు అనుమతులు,నిబంధనలకు తిలోదకాలు..!
- సీజ్ చేస్తాం-మూసేస్తామని చెప్పిన "ఎంఈఓ-డీఈఓ" పర్మిషన్ మంజూరు..!
- బౌరంపేట్ లహరి రోడ్డులో రెసిడెన్షియల్ భవనంలో నారాయణ పాఠశాల..
- సెట్‌బ్యాకులు ఆక్రమించి వాచ్‌మెన్ రూము నిర్మాణం- సెల్లార్‌కి దారి..!
- అనుమతులు లేవని చెప్పిన ఎంఈఓ పాఠశాల పర్మిషన్‌కు ప్రతిపాదనలు..
- సీజ్ చేస్తామన్న మేడ్చల్ జిల్లా విద్యాధికారి అడ్డు చెప్పకుండా అనుమతులు జారీ..

- బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులోనూ బిల్డర్ రాజారెడ్డి నిబంధనలకు పాతర..!
- రెసిడెన్షియల్ పర్మిషన్‌తో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో నారాయణ ఏసీ క్యాంపస్..
- మూసేస్తాం-సీజ్ చేస్తామన్న-విద్యాశాఖ అధికారులు ముడుపులు పుచ్చుకున్నారా..?
- అర్హతలేని అపార్ట్‌మెంట్‌లో పాఠశాల నిర్వహణ, ఏ నిబంధనల ప్రకారం..?
- నారాయణ విద్యాసంస్థలకు ప్రత్యేక మినహాయింపు ఉందా..?
- పరపతి ఉన్నోళ్ళకే ప్రాధాన్యత.. కార్పోరేట్ పాఠశాల ఏసీ క్యాంపస్‌కి తప్పుడు పర్మిషన్..?
- కార్పోరేట్ విద్యాసంస్థలకు వత్తాసుగా మేడ్చల్ జిల్లా విద్యాశాఖ..


# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

గురువారం | 7 ఆగస్టు 2025 | పేజీలు 8


# అధికారుల అలసత్వం..!
# ప్రాణాలతో చెలగాటం..!



సెట్‌బ్యాకులు ఆక్రమించి సెల్లార్‌కి దారి..



సెట్‌బ్యాకుల్లో వాచ్‌మెన్ గదుల నిర్మాణం..

## రెసిడెన్షియల్ భవనంలో కమర్షియల్ యాక్టివిటీ..! నారాయణ ఏసీ క్యాంపస్..

విద్యాశాఖ అధికారులు బరితెగింపుతో నిబంధనలకు తిలోదకాలు వదిలి.. విద్యార్థులను ప్రమాదంలో పెడుతున్నారు.. సెట్‌బ్యాకులు ఆక్రమించి, వాచ్‌మెన్ రూము, సెల్లార్‌కి దారి నిర్మించినా, మున్సిపల్ కమిషనర్, టిపిఎస్ చర్యలకు బదులు ముడుపులు పుచ్చుకుని సైలెంట్‌గా ఉండగా..! అలాంటి అక్రమ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో కార్పోరేట్ పాఠశాల, హైస్కూల్ ఏసీ క్యాంపస్‌కి అద్దెకిచ్చి, "మున్సిపల్- విద్యాశాఖ" అధికారులు విద్యార్థుల ప్రాణాలతో, చెలగాటం ఆడుతున్నారు..! దీనికి తోడు సీజ్ చేస్తాం, స్కూల్ మూసేస్తామని ప్రగల్భాలు పలికిన, మండల విద్యాధికారి(ఎంఈఓ), జిల్లా విద్యాధికారి (డిఈఓ) సంబంధిత పాఠశాలకు పర్మిషన్ ఇచ్చామని చెప్పడం, అవినీతి అధికారులకు నిదర్శనంగా చెప్పవచ్చు..!మరోవైపు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కి, ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం.. సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రజావాణి కార్యక్రమం ఉత్తుతిదేనని నిరూపణ అయింది..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 6:**

-2లో




బౌరంపేట్‌లో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో "నారాయణ పాఠశాల"..

# భూ భారతి దరఖాస్తులు.. త్వరితగతిన పరిష్కరించాలి..



- మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..
- శామీర్‌పేట్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు..

-3 లో

# తెలంగాణ సిద్ధాంత కర్తకు.. కలెక్టర్ ఘన నివాళులు..

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతి వేడుకలు..
- మహనీయునికి పూలమాల వేసి, నివాళులు అర్పించిన కలెక్టర్..
- డిఆర్ఓ హరిప్రియతో కలిసి  జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన గావించారు..



-3 లో

# అధికారుల అలసత్వం..! ప్రాణాలతో చెలగాటం..!


















దుండిగల్ మున్సిపల్ నుండి.. రెసిడెన్షియల్ బిల్డింగ్ పర్మిషన్..




సెట్‌బ్యాకులు ఆక్రమణ విషయాన్ని చూపించకుండా..
కమిషనర్ ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ..

**సంబంధిత అపార్ట్‌మెంట్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా సెక్షన్ 168ని ధిక్కరించి, ఒకవైపు 4 మీటర్లు సెట్‌బ్యాకులను ఆక్రమించి, వాచ్‌మెన్ గదులు నిర్మించారు.. సెల్లార్‌కి దారిని ఏర్పాటు చేశారు.. అయినప్పటికీ దుండిగల్ మున్సిపల్ అధికారులు గుడ్డిగా ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయడంలో వారి అవినీతి తేటతెల్లం చేస్తోంది.. ఇలాంటి తప్పుడు రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో "నారాయణ విద్యాసంస్థలకు" హైస్కూల్ ఏసి క్యాంపస్ కమర్షియల్ కార్యకలాపాలకు అద్దెకు ఇస్తుంటే మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు తీసుకున్న ముడుపులు..? అర్హత లేని, తప్పుడు నిర్మాణంలో "నారాయణ విద్యాసంస్థలకు" పలుకుబడితో పర్మిషన్ మంజూరు చేసిన విద్యాశాఖ అధికారులు, విద్యార్థులను ప్రమాదంలో పెట్టారు.. పాఠశాలకు పర్మిషన్ ఇవ్వడానికి ఎంత స్వీకరించారు..? ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని స్థానికులు కోరుతున్నారు..**

**మొదటి పేజి తరువాయి**

మేడ్చల్ జిల్లా విద్యాశాఖ, దుండిగల్ మున్సిపాలిటీ అవినీతికి అద్దం పడుతున్నారు..! ఈ రెండు శాఖలకి చెందిన అధికారుల అలసత్వం, హద్దు మీరుతోంది.. దుండిగల్ మున్సిపల్ కమిషనర్ అండ్ టౌన్‌ప్లానింగ్ అధికారి టిజి–బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుండగా.. మేడ్చల్ జిల్లా విద్యాధికారి, దుండిగల్ మండల విద్యాధికారి, నిబంధనలకు వ్యతిరేకంగా రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో ,కమర్షియల్ కార్యకలాపాలను ప్రోత్సాహించే విధంగా వ్యవహరిస్తున్నారు.. పాఠశాల అనుమతులు జారీచేయడం గమనార్హం.. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని, బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో సర్వే నెం.541, 542, 544, 545, 547, 548, 554, 555, 560, ప్లాట్ నెంబర్: 858ఎ అండ్ 859ఎ.. ఫైల్‌నెం.004339/ BP/DTCP/ 3144/0020/2023.. పరిమిట్ నెం. 0013/BP/3144/2023.. ప్రకారం 30 మే, 2023న రెసిడెన్షియల్ పర్మిషన్..! బిల్డర్ రాజారెడ్డి నిర్మించిన, బాస్కర్‌రెడ్డికి చెందిన ఈ రెసిడెన్షియల్ అనుమతుల అపార్ట్‌మెంట్‌లో..! 4 మీటర్ల సెట్‌బ్యాకులు ఆక్రమించి, వాచ్‌మెన్ రూము నిర్మాణం, సెల్లార్‌కి వెళ్ళేందుకు దారని ఏర్పాటు చేశారు.. ఈ అక్రమ నిర్మాణంపై "పెన్ పవర్" దినపత్రికలో పలుమార్లు వార్తలు వచ్చినా, మున్సిపల్ అధికారులు "దున్నపోతు మీద వర్షం పడిన" చందగా, చలనం లేకుండా వ్యవహరించడం విశేషం.. పైగా సెటిల్మెంట్ చేసుకో లేదా నీ ఇష్టం, చర్యలు మాత్రం ఉండవని చెప్పకనే, బహిరంగంగానే చెప్పడం గమనార్హం.. ఇందులో ఓ కాంగ్రెస్ నేత సిఫార్సులు ఉన్నాయని మున్సిపల్ అధికారులు చెప్పడం బాధాకరం.. సంబంధిత నేత ఎన్నికల్లో ఓడినా, ఇలాంటి అక్రమ కట్టడాలను ప్రోత్సాహించడంలో ముందంజలో ఉంటున్నాడు.. అధికారులకైనా కొంచెం బాధ్యత ఉండాలికదా..! మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ చర్యలు ఎలాగు ఉండవు.. అటు భవనంపై చర్యలు లేవు.. ఇటు విద్యాశాఖ అధికారులు తప్పుడు అనుమతులు జారీ..

## సీజ్ చేస్తా.!పాఠశాల మూసేస్తా.! ప్రగల్భాలు పలికి పర్మిషన్ జారి..

మేడ్చల్ జిల్లా విద్యాధికారి, దుండిగల్ మండల విద్యాధికారి, కార్పోరేట్ పాఠశాలకు తప్పుడు అనుమతులు ఇవ్వడంలో ప్రత్యేక శిక్షణ పొందారు కాబోలు..వారి సమాధానానికి, చేతలకి అసలు సంబంధమే ఉండదు.. దాదాపు రెండు నెలలపాటు దుండిగల్ మండలం విద్యాధికారి (ఎంఈఓ) కృష్ణతో ఫోన్‌లో వివరణ తీసుకుని వార్తా కథనాలు వచ్చినప్పటికీ.. వారం క్రితం పర్మిషన్ ఇచ్చామని చెప్పడం విశేషం.. ఎంఈఓ తెలిపిన విషయాన్ని, మేడ్చల్ జిల్లా డిఈఓ విజయ కుమారితో ప్రస్తావించగా, అవును, మున్సిపల్ కమిషనర్ క్లియరెన్స్ ఇచ్చారని, అందుకే పర్మిషన్ ఇచ్చామని చెప్పడం గమనార్హం.. రెండు నెలలపాటు ఎంఈఓ కృష్ణ సీజ్ చేస్తామని, స్కూల్ మూసేయమని చెప్పినట్లు పెన్ పవర్ ప్రతినిధితో తెలిపారు.. డీఈఓ విజయకుమారి కూడా, నారాయణ పాఠశాలని సీజ్ చేస్తామని, తమ ఎంఈఓ, కుమారుడి వివాహ వెడుకల్లో బిజీగా ఉన్నాడని, చెప్పిన జిల్లా విద్యాధికారి, ఒక్కసారిగా పర్మిషన్ ఇచ్చామని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రికి చెందిన కార్పోరేట్ విద్యాసంస్థలకు తప్పుడు అనుమతులు మంజూరు చేసి..! తెలంగాణ విద్యార్థులను రిస్కులో పెడతారా..? జిల్లా కలెక్టర్ మను చౌదరి ఈ విషయంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు..















# తెలంగాణ సిద్ధాంత కర్తకు.. కలెక్టర్ ఘన నివాళులు..

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతి వేడుకలు..**

**మహనీయునికి పూలమాల వేసి, నివాళులు అర్పించిన కలెక్టర్..**

**డిఆర్ఓ హరిప్రియతో కలిసి జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన గావించారు..**





జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న కలెక్టర్ మను చౌదరి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 6:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు.. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ 91 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ హరిప్రియతో కలిసి జిల్లా కలెక్టర్ మను జ్యోతి ప్రజ్వలన గావించారు.. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు.. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. ప్రతి ఉద్యోగి, పౌరుడు ఆయన అడుగుజాడల్లో నడవాలని కొనియాడారు.. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పనిచేస్తే, అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణీ, ఎ.ఓ.రాంమోహన్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తులు.. త్వరితగతిన పరిష్కరించాలి..

- **మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..**
- **శామీర్‌పేట్ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు..**



దరఖాస్తులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి..



షామీర్‌పేట్ తహశీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 6:** భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.. బుధవారం భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు పరిష్కార దిశలో భాగంగా శామీర్ పేట్ తహసీల్దారు కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ భూభారతి ఆన్‌లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు ఎంత వరకు పరిష్కారం అయ్యాయని శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి, జాప్యంపై కారణాలను పరిశీలించారు. సాంకేతిక పరమైన ఏమైన ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే క్లియర్ చేసుకోవాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.. ఆన్‌లైన్‌లో మ్యానువల్‌గా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అదనపు కలెక్టర్ పరిశీలించారు..

# నీ ఇంట్లో, ఒంట్లో.. నీ రక్తంలోనే డ్రామా ఉంది.. కేటీఆర్‌పై CM రేవంత్ రెడ్డి ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:**న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామాలేస్తుందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని ఢిల్లీలో కాంగ్రెస్ చేస్తోన్న ధర్నాను కేటీఆర్ డ్రామా అంటున్నాడు. కానీ కేటీఆర్ పేరే డ్రామా రావు. నీ ఇంట్లో, ఒంట్లో, నీ రక్తంలోనే డ్రామా ఉందని డ్రామాలు వేసుకుంటునే నీ కుటుంబం బతుకుతోందని కేటీఆర్?కు కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ ఇంట్లోనే ఒకరు బీసీ రిజర్వేషన్లకు అనుకూలం.. మరొకరు వ్యతిరేకమని.. అటు ఇటు గానీ వాళ్లు నా గురించి మాట్లాడతారా అని నిప్పులు చెరిగారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీలో మద్దతు తెలిపినా బీఆర్ఎస్.. ఆ బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన మహాధర్నాకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.బీసీల ఓట్లు మీకు అవసరం లేదా.. బలహీనవర్గాల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు నిలదీయట్లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ బీసీలపై కక్ష్య గట్టి తెలంగాణలో బలహీనవర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆ చట్టాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని.. ఆ ఆర్డినెన్స్?ను కూడా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మరోసారి విరుచుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే.. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు మోకాలడ్డేస్తున్నాయని ఫైర్ అయ్యారు. తెలంగాణ బీజేపీ నేతలంటే ప్రధాని మోడీ మోచేతి నీళ్లు తాగుతూ బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు.. మరీ బీఆర్ఎస్?కు ఏమైంది..? మీరు కూడా మోడీ చెప్పులు మోస్తున్నారా అని విమర్శించారు.

# సుమన్ పొలిటికల్ ఎంట్రీ? ఏ పార్టీలోకి అంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ నటుడు సుమన్ తన రాజకీయ ప్రవేశంపై మరోసారి ఆసక్తిని వ్యక్తం చేశారు. గతంలో కూడా రాజకీయాలపై తన అభిప్రాయాలను పంచుకున్న సుమన్, ఇప్పుడు నేరుగా తనకు రాజకీయ పార్టీల నుండి ఆఫర్లు వస్తున్నాయని వెల్లడించారు. తాను తమిళనాడులో పుట్టి, పెరిగి, అక్కడ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కారణంగా అక్కడి కొన్ని రాజకీయ పార్టీలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాల్సిందిగా తనను సంప్రదించాయని ఆయన తెలిపారు. అంతేకాదు, ఎమ్మెల్యే టికెట్ కూడా ఇస్తామని వాగ్దానం చేసినట్లు సుమన్ చెప్పారు.

**సుమన్ మాటల్లోనే...**

"తమిళనాడులో నాకు మంచి గుర్తింపు ఉంది. ఆ బలమైన గుర్తింపును చూసి కొన్ని పార్టీలు నన్ను తమ పార్టీలోకి ఆహ్వానించాయి. ఎమ్మెల్యేగా నిలబెట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నాయి" అని ఆయన మీడియాకు తెలిపారు. ఈ వ్యాఖ్యలు సుమన్ రాజకీయ ప్రయాణానికి బలమైన సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

**ఆంధ్రప్రదేశ్‌పై సుమన్ అభిప్రాయం**

తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌పై కూడా సుమన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. అయితే, ఏపీలో ఇప్పటికే ఎన్నికలు ముగియడంతో, తాను 2029 నాటికి ఏపీ రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే విషయంపై ఒక నిర్ణయం తీసుకుంటానని సుమన్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఆయనకు ఏపీ రాజకీయాలపై కూడా ఆసక్తి ఉందని సూచిస్తున్నాయి. గతంలో ఆయన వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాలనను, అలాగే చంద్రబాబు నాయుడు పాలనను కూడా ప్రశంసించడం ద్వారా ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారనే విషయంలో కొంత గందరగోళం ఉంది. అయితే, ఆయన రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

**సుమన్ దారెటు?**

సుమన్ రాజకీయ ప్రయాణం ఎక్కడ మొదలవుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఆయన తమిళనాడులో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? లేక 2029 వరకు వేచి చూసి ఆంధ్రప్రదేశ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటారా? అనేది కాలమే నిర్ణయిస్తుంది. ఏదేమైనా, సుమన్ రాజకీయ రంగ ప్రవేశంపై సినీ అభిమానులు, రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఆయన ఏ పార్టీలో చేరబోతున్నారు, ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారు అనే అంశాలపై భవిష్యత్తులో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# నేను గేమింగ్ యాప్‌ను మాత్రమే ప్రమోట్ చేశా



**హైదరాబాద్ పెన్ పవర్:**బెట్టింగ్ యాప్ కేసులో నా పేరు రావడం తో విచారణకు పిలిచారని హీరో విజయ్ దేవరకొండ తెలిపారు. ఈడీ కార్యాలయంలో విచారణ ముగిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో బెట్టింగ్ యాప్స్ , గేమింగ్ యాప్స్ అని రెండు రకాలు ఉన్నాయి.. నేను A23 అనే యాప్ గేమింగ్ యాప్ అని ఈడీకి క్లారిటీ ఇచ్చానని పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్స్ , గేమింగ్ యాప్స్ కి సంబంధం లేదు.. గేమింగ్ యాప్స్ అనేది దేశంలో చాలా రాష్ట్రాల్లో లీగల్ అని.. గేమింగ్ యాప్స్ కి GST , టాక్స్, అనుమతులు, రిజిస్ట్రేషన్ ఉంటాయని.. దేశంలో గేమింగ్ యాప్స్ IPL , కబడీ, వాలీ బాల్ కి స్పాన్సర్ చేస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంక్ లావాదేవీలు అన్ని కూడా ఈడీకి సమర్పించానని తెలిపారు. నేను ప్రమోట్ చేసిన A23 యాప్ అనేది తెలంగాణలో ఓపెన్ అవ్వదని.. నేను లీగల్ గా ఉన్న గేమింగ్ యాప్స్ ను మాత్రమే ప్రమోట్ చేశానని క్లారిటీ ఇచ్చారు. నేను చేసుకున్న కాంట్రాక్ట్, లీగల్‌గా తీసుకున్న అమౌంట్ వాటి వివరాలు అన్ని ఈడీకి ఇచ్చానని వివరించారు.

# నియోజకవర్గాలకు 'ప్రోగ్రెస్ కార్డు' రెడీ ..!



హైదరాబాద్ పెన్ పవర్:అధికార పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం చంద్రబాబు ప్రోగ్రెస్ కార్డులు రెడీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి.. ఏడాది అయిన నేపథ్యంలో వచ్చే నెలలో నియోజకవర్గాల వారీగా.. ప్రోగ్రెస్ కార్డులను అందించాలని సీఎం చంద్రబాబు తాజాగా నిర్ణయించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియను కేవలం టీడీపీకి మాత్రమే పరిమితం చేయాలని భావిస్తున్నారు. ఒకవేళ బీజేపీ, జనసేనలు కూడా ముందుకు వస్తే.. అందరికీ కలిపి ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వనున్నారు. అయితే.. దీనికి ఐదు అంచల్లో లక్ష్యాలను పెట్టుకున్నారు. వాటిని చేరుకున్న నియోజకవర్గాలకు ఏం, మధ్యస్థంగా ఉన్నవాటికి ఏ, మరింతగా పనులు సాగాల్సిన నియోజకవర్గాలకు బీ ప్రాతిపదికన సర్టిఫికెట్లను అందించనున్నారు.

**ఏంటా అంచనాలు..?**

1) నియోజకవర్గంలో అభివృద్ధి: ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రహదారుల నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేసిన నియోజకవర్గాలు దీనిలో ఉంటాయి. రహదారుల నిర్మాణం ద్వారా.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించి.. వీటి ద్వారా ప్రజల సానుకూల పొందడాన్ని ప్రధానంగా దీనిలో చర్చిస్తారు.

2) సుపరిపాలన: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా .. ప్రజలకు చేరువైన ఎమ్మెల్యేల గ్రాఫ్ ను పరిగణనలోకి తీసుకుంటారు. నిజానికి రాష్ట్రవ్యాప్తంగా 132 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని చంద్రబాబు ఆదేశించారు. ఒక్క కుప్పం, మంగళగిరిని మాత్రమే మినహాయించారు. ఆయా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని అనుసరించిన ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేస్తారు.

3) కూటమి కలివిడి: కూటమి పార్టీల నేతలను కలుపుకొని పోవడాన్ని కూడా ఒక ప్రాతిపదికగా.. నియోజకవర్గాలకు.. మార్కులు వేస్తున్నారు. దీనిపై ఎప్పటి నుంచో చంద్రబాబు నాయకులకు చెబుతున్నారు. కలివిడి ముఖ్యమని దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పుడు దీనికి కూడా మార్కులు వేయనున్నారు. తద్వారా ఎక్కడైనా పొరపొచ్చాలు ఉంటే వాటిని సర్దుబాటు చేసుకునే అవకాశం ఇవ్వనున్నారు.

4) ప్రత్యర్థుల విమర్శలపై కౌంటర్: ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇచ్చే ఎమ్మెల్యేల జాబితా ఆధారంగా కూడా.. నియోజకవర్గాలకు మార్కులు కేటాయించనున్నారు. చాలా వరకు నియోజకవర్గాల్లో ప్రత్యర్థుల విషయంలో ఎమ్మెల్యేలు సైలెంట్‌గా ఉంటున్నారన్నది చంద్రబాబు చెబుతున్న మాట. ఇప్పుడు దీనిని కూడా నియోజకవర్గాలకు మార్కులు ఇచ్చే విషయంలో ప్రాతిపదికగా తీసుకుంటారు.

5) ఆరోపణలు: నియోజకవర్గాల్లో కొందరు ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిని పరిహరించేందుకు కూడా ఈ ప్రోగ్రెస్ కార్డులు పనిచేయనున్నాయి. దీనికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటి నుంచి వచ్చే మూడు మాసాల కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి ఏడాదిన్నర పూర్తయ్యాక.. ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనిని బట్టి ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకుంటారని చంద్రబాబు అంచనా వేసుకుంటున్నారు.

## క్లౌడ్ బరస్ట్ తో ఉత్తరకాశీ అతలాకుతలం.. బాధితులకు అండగా ఉండాలని సినీ ప్రముఖుల పిలుపు



హైదరాబాద్ పెన్ పవర్:భారీ వర్షాలు, వరదలతో ఉత్తరాఖండ్ అతలాకుతలం అవుతోంది. ఉత్తరకాశీ జిల్లాలోని ధరాలి గ్రామంలో సంభవించిన క్లౌడ్ బర్స్ట్ తో భయానకపరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కసారిగా ఖీర్ గంగానది ఉప్పొంగడంలో ఇప్పటివరకు నలుగులు ప్రాణాలు కోల్పోగా, సుమారు 100 మందికి పైగా గల్లంతయ్యారు. ఇళ్లు , హోటళ్లు , మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. దీంతో స్థానికులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నాయి. ఎటు చూసినా బాధితుల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి.

అటు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ చర్యలు ముమ్మరం చేశాయి. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఐటీబీపీ, స్థానిక బృందాలు, డ్రోన్లు , భారీ యంత్రాలు ఉపయోగించి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నాయి. మరోవైపు కుండపోత వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఈ విషాదకర ఘటనపై బాలీవుడ్ ప్రముఖులు తమ సంతాపం, ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మనమందరం కలిసికట్టుగా బాధితులకు అండగా నిలబడాల్సిన సమయం ఇది అని స్పష్టం చేశారు.

ఉత్తరాఖండ్‌లో సంభవించిన భయంకరమైన వరదలు, మేఘవిస్ఫోటనం చూసి తన హృదయం ముక్కలైందని నటుడు సోనూ సూద్ అన్నారు. ప్రభావితమైన ప్రతి ప్రాణానికి నా ప్రార్థనలు. ప్రభుత్వం తన వంతు కృషి చేస్తున్నప్పటికీ, మనమందరం కలిసికట్టుగా నిలబడాల్సిన సమయం ఇది. ఇళ్లు, జీవితాలు కోల్పోయిన ప్రతి ఆత్మకు మనం అండగా ఉండాలి అని తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ భయానక విపత్తులో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు నటి సారా అలీఖాన్. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి ఒక్కరై సురక్షితంగా, ధైర్యంగా ఉండాలని కోరుకుంటున్నాను అని తన ఇన్ స్టా గ్రామ్ లో పోస్ట్ చేశారు. అంతేకాకుండా, ఆమె ఉత్తరకాశీ జిల్లా అత్యవసర ఆపరేషన్ సెంటర్ జారీ చేసిన ముఖ్యమైన సంప్రదింపు నెంబర్లను కూడా షేర్ చేశారు.

హరిద్వార్ బిడ్డగా, ఉత్తరాఖండ్‌లోని ప్రతి రాయి, ప్రతి నది, ప్రతి గాలి నా ఆత్మలో భాగం. ఈరోజు ఉత్తరకాశీలోని ఖీర్ గంగ నదిలో వినాశకరమైన వరదలను చూసి, నా భూమి, నా ప్రజలు, నా కుటుంబం... చెప్పలేని బాధను అనుభవిస్తున్నాను అని ఊర్వశి రౌతేలా తెలిపారు. సహాయం చేయడానికి తాను తన వంతుగా కృషి చేస్తానని, అభిమానులను, శ్రేయోభిలాషులను సహాయం కోసం ముందుకు రావాలని కోరారు. ఉత్తరాఖండ్ లోని వరదలు, హృదయ విదారక దృశ్యాలపై అడివి శేష్ స్పందించారు. ఉత్తరాఖండ్ కోసం ప్రార్థనలు. హృదయం ముక్కలయ్యే దృశ్యాలు అని తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఈ ఘోర విపత్తులో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు, నిరాశ్రయులైన వారికి సహాయం చేసేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో పరిస్థితులు హృదయవిదారకం అని భూమి పెడ్నేకర్ తన ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. అంతులేని అభివృద్ధి కోసం అడవులను నరికివేస్తున్నారు. ప్రకృతిని సమతుల్యం చేసే ఆలోచన లేదు. ప్రతి వర్షాకాలంలో ఈ రాష్ట్రాలు వరదలతో తీవ్రంగా విధ్వంసానికి గురవుతున్నాయి. కొన్ని దృశ్యాలు భయంకరంగా ఉన్నాయి. ప్రకృతి ప్రకోపం ముందు మనమంతా శూన్యమే అని తెలుసుకోండి. ఇలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాని ప్రభుత్వాన్ని, అభిమానులకు కోరారు.

భూమి పెడ్నేకర్ ఇన్‌స్టాగ్రామ్‌లో వాతావరణ మార్పులపై తన ఆందోళన వ్యక్తం చేస్తూ, "హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో జరుగుతున్నది హృదయవిదారకం. అంతులేని అభివృద్ధి కోసం అడవులను నరికివేస్తున్నారు. ప్రకృతిని సమతుల్యం చేసే ఆలోచన లేదు. ప్రతి వర్షాకాలంలో ఈ రాష్ట్రాలు వరదలతో తీవ్రంగా విధ్వంసానికి గురవుతున్నాయి. కొన్ని దృశ్యాలు భయంకరంగా ఉన్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్న వారికి నా హృదయం అంకితం. ప్రకృతి ప్రకోపం ముందు మనమంతా శూన్యమే. తెలుసుకోండి," అని పోస్ట్ చేశారు. ఉత్తరకాశీలో జరిగిన ఈ ఘోర విపత్తులో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు, నిరాశ్రయులైన వారికి సహాయం చేయడానికి ముందుకు రావాలని ఈ సెలబ్రిటీలు తమ అభిమానులకు, అనుచరులకు పిలుపునిచ్చారు. ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉండాలని కోరారు.

## కన్న కూతురిపై హత్యాచారం...

# కామాంధుడికి ఉరిశిక్ష

- బెంగాల్‌లో దారుణం: బాలికపై తండ్రి అఘాయిత్యం.. ఉరితీయాలని కోర్టు ఆదేశం
- పశ్చిమ బెంగాల్ అసన్‌సోల్ పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు
- ఘటన జరిగిన 15 నెలల్లోనే విచారణ పూర్తి చేసి శిక్ష ఖరారు
- కీలకంగా మారిన డీఎన్‌ఏ నివేదిక, 16 మంది సాక్షుల వాంగ్మూలాలు
- గతేడాది మే 13న 15 ఏళ్ల బాలికపై తండ్రి కిరాతక చర్య



**హైదరాబాద్ పెన్ పవర్:**సభ్యసమాజం తలదించుకునే అత్యంత కిరాతకమైన నేరానికి పాల్పడిన ఓ కసాయి తండ్రికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది. 15 ఏళ్ల కన్న కూతురిపైనే అత్యాచారం చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేసిన కేసులో ఈ సంచలన తీర్పు వెలువడింది. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ బర్ధమాన్ జిల్లా అసన్‌సోల్‌లో ఉన్న పోక్సో ప్రత్యేక కోర్టు ఈ ఘటన జరిగిన 15 నెలల్లోనే విచారణ పూర్తి చేసి నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసింది. వివరాల్లోకి వెళితే, అసన్‌సోల్‌లోని హీరాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగ్‌బంధ్ ప్రాంతంలో గత ఏడాది మే 13న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. బాలిక తల్లి ఇంటికి వచ్చేసరికి, తన కూతురు మంచంపై పడి ఉండి ముక్కు, చెవుల నుంచి రక్తం కారుతూ కనిపించింది. ఆమె మెడపై కూడా గాయాలున్నాయి. భయంతో తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో భర్త తనను ఆసుపత్రికి వెళ్లకుండా అడ్డుకున్నాడని తల్లి ఆరోపించింది. అయితే, స్థానికులు బలవంతంగా బాలికను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు తండ్రిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. పోస్ట్‌మార్టం నివేదికలో బాలికపై అత్యాచారం జరిగినట్లు, అనంతరం తాడుతో గొంతు బిగించి చంపినట్లు తేలింది. పోలీసులు ఇంటి సమీపంలోని చెత్తకుండీ నుంచి హత్యకు ఉపయోగించిన తాడును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 16 మంది సాక్షుల వాంగ్మూలాలు, ఇతర కీలక ఆధారాలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ముఖ్యంగా, బాధితురాలి శరీరంపై, దుప్పట్లపై లభించిన డీఎన్‌ఏ ఆనవాళ్లు నిందితుడైన తండ్రితో సరిపోలడం ఈ కేసులో తిరుగులేని సాక్ష్యంగా నిలిచిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమనాథ్ చట్టరాజ్ తెలిపారు. తల్లి వాంగ్మూలం, దర్యాప్తు అధికారి, వైద్యుల నివేదికలు, ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా జడ్జి సుపర్ణ బందోపాధ్యాయ నిందితుడిని దోషిగా నిర్ధారించి, బుధవారం నాడు మరణశిక్ష విధిస్తూ తుది తీర్పును ప్రకటించారు.

# రాఖీ పండుగ 2025: రాఖీ కట్టేటప్పుడు ఎన్ని ముడులు వేయాలి.. 3, 5, 7 ఎన్నో తెలుసుకోండి..!





**హైదరాబాద్ పెన్ పవర్:**రాఖీ పండుగ.. రక్షాబంధనము అన్నదమ్ములు.. అక్కా చెల్లెళ్లు జరుపుకునే పండుగ. రాఖీ పండుగ ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఈ ఏడాది ఆగస్టు 9న జరుపుకొనే రాఖీ పండుగ తోబుట్టువులకు ప్రతీకగా నిలుస్తుంది. అయితే అన్నా, తమ్ముళ్లకు రాఖీ కట్టేటప్పుడు ఎన్ని ముళు వేయాలి.. ? ఐదు లేదాఏడు ముళ్లు ఎందుకు వేయకూడదు? ఏ సమయంలో రాఖీ కట్టాలి .. దీని వెనకున్న కారణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. రక్షాబంధనం .. రాఖీ పండుగ అంటే కేవలం రాఖీ కట్టడమే కాదు. సోదరికి.. సోదరుడు రక్షగా ఉంటాడని చెప్పడం.. అలాగే సోదరుడి అభివృద్ధిని..సోదరి కోరుకుంటుందని చెప్పే పండుగ రాఖీ . రాఖీని కట్టేటప్పుడు మూడు ముళ్లు వేయాలి. ఈ మూడు ముళ్లు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల.. త్రిమూర్తులకు ప్రతీకగా నమ్ముతారు. మొదటి ముడి సోదరుడి దీర్ఘాయుష్షు, భద్రత, ఆనందం మరియు శ్రేయస్సును సూచిస్తుంది. రెండవ ముడి సోదరుడు మరియు సోదరి మధ్య విడదీయరాని ప్రేమ, నమ్మకం మరియు గౌరవాన్ని సూచిస్తుంది. మూడవ ముడి సోదరుడు తన జీవితంలో ఎల్లప్పుడూ గౌరవం , సత్య మార్గాన్ని అనుసరించాలని ... తాను ఏ పరిస్థితిలో ఉన్న తన సోదరిని రక్షించాలని తన విధులను గుర్తు చేస్తుంది.

**రాఖీ ఎప్పుడు కట్టాలి..**

శ్రావణ పౌర్ణమి తిథి ఆగస్టు 08, 2025న మధ్యాహ్నం 02:12 గంటలకు ప్రారంభమై ఆగస్టు 09, 2025న మధ్యాహ్నం 01:24 గంటలకు ముగుస్తుంది. రాఖీ కట్టడానికి శుభ సమయం ఆగస్టు 9న ఉదయం 06:18 నుండి మధ్యాహ్నం 01:24 వరకు ఉంటేంది. సూర్యోదయానికి ముందే భద్ర సమయం ముగిసిపోతుందని పండితులు చెబతున్నారు.

రాఖీని మూడు ముళ్లతో కట్టే ఆచారం విశ్వాసం, ఐక్యత, శాశ్వత తోబుట్టువుల సంబంధానికి అందమైన ప్రతిరూపంగా భావిస్తారు. ఇది కేవలం ఒక దారం మాత్రమే కాదు. కాలాన్ని, దూరాన్ని దాటి, సోదర సోదరీమణుల మధ్య సంబంధాన్ని బలపరిచే పవిత్ర బంధం.అందుకే మీ సోదరుడి మణికట్టుకు రాఖీ కట్టేటప్పుడు మూడు ముడులు వేయమని పండితులు సూచిస్తున్నారు.

# వరలక్ష్మీ వ్రతం పూజలో తెలంగాణ ప్రసాదాలు : పప్పు, పాయసం ఇలా ట్రై చేయండి.. ఆరోగ్యం కూడా..!



**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రావణ మాసం అంటేనే... ఉపవాసాలు, పూజలు, వ్రతాలు. మరీ ముఖ్యంగా అమ్మవారికి ప్రసాదాలు పెట్టడం ఆనవాయితీ. ఆ ప్రసాదాల్లో స్వీట్స్? కే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు మహిళలు. ఎప్పుడూ ఒకేరకమైన ప్రసాదం పెట్టడం ఇష్టం లేనివాళ్లు వెరైటీగా చేసి పెడతారు. అలాంటి వాళ్ల కోసమే ఈ పప్పుల పాయసాలు..

**శెనగపప్పు ప్రసాదం తయారీకి కావాల్సినవి:**

శెనగపప్పు:ముప్పావు కప్పు
పాలు: ముప్పావు కప్పు
బెల్లం తురుము: ఒక కప్పు
ఎండుకొబ్బరి ముక్కలు: ఒక టేబుల్ స్పూన్ (కావాలంటే)
ఇలాచీ పొడి: అర టీ స్పూన్
జీడిపప్పు, కిస్మిస్: ఒక్కోటి అర టేబుల్ స్పూన్ చొప్పున
నెయ్యి: రెండు టేబుల్ స్పూన్లు

**తయారీ విధానం:** స్టవ్ పై పాన్? పెట్టి శెనగపప్పుని వేగించాలి. తర్వాత వేగించిన పప్పులో ఒకటిన్నర కప్పు నీళ్లు పోసి ప్రెజర్ కుక్కర్? లో నాలుగు విజిల్స్? వచ్చే వరకు ఉడికించాలి. తర్వాత పప్పుగుత్తితో మరీ మెత్తగా కాకుండా కచ్చాపచ్చాగా రుబ్బాలి. స్టవ్? పై ఒక గిన్నె పెట్టి బెల్లం తురుము, పావు కప్పు నీళు పోసి బెల్లం కరిగే వరకు వేడి చేయాలి. అందులో రుబ్బిన శెనగపప్పు, ఇలాచీ పొడి వేసి ఐదు నిమిషాలు మగ్గించాలి. తర్వాత నెయ్యిలో వేగించిన కిస్ మిస్, జీడిపప్పు, ఎండుకొబ్బరి ముక్కలు వేసి స్టవ్ ఆపేయాలి

**పెసర పప్పు తయారీకి కావాల్సినవి:**

పెసరపప్పు: అర కప్పు
నీళ్లు: ఒక కప్పు
పాలు: అర కప్పు
బెల్లం తురుము లేదా చక్కెర: అర కప్పు
ఇలాచీ పొడి: అర టీ స్పూన్
కిస్మిస్, జీడిపప్పు: ఒక టేబుల్ స్పూన్ చొప్పున
నెయ్యి: సరిపడా

**తయారీ విధానం:**పెసరపప్పుని ముందుగా వేగించి, నీళ్లతో కడగాలి. తర్వాత ఆ పప్పులో ఒక కప్పు నీళ్లు పోసి ప్రెజర్ కుక్కర్? లో రెండు విజిల్లు వచ్చే వరకు ఉడికించాలి. స్టవ్ పై పాన్? పెట్టి నెయ్యి వేడి చేయాలి. అందులో పెసరపప్పు ముద్ద, బెల్లం తురుము లేదా చక్కెర వేసి కలపాలి. బెల్లం పూర్తిగా కరిగాక పాలు పోయాలి. మిశ్రమం దగ్గరికయ్యాక ఇలాచీ పొడి, నెయ్యిలో వేగించిన కిస్మిస్, జీడిపప్పు వేసి కలపాలి. మామూలు పాలకు బదులు కొబ్బరి పాలు కూడా వాడొచ్చు

కందిపప్పు ప్రసాదం తయారీకి కావలసినవి

ఉడికించిన కందిపప్పు: పావు కప్పు
పాలు: ఒక కప్పు,
బెల్లం తురుము: అర కప్పు
కిస్మిస్, జీడిపప్పు తరుగు: ఒక్కోటి ఒక టేబుల్ స్పూన్ చొప్పున
ఇలాచీ పొడి: అర టీ స్పూన్
నెయ్యి: ఒక టేబుల్ స్పూన్

తయారీవిధానం: స్టవ్ పై పాన్ పెట్టి నెయ్యి వేడి చేయాలి. అందులో జీడిపప్పు తరుగు, కిస్మిస్?లు వేగించి వేరే ప్లేట్లో వేయాలి. అదే పాన్? లో ఉడికించిన కందిపప్పు, బెల్లం తురుము, పాలు వేయాలి. మిశ్రమం మరిగాక, స్టవ్ మంట తగ్గించాలి. అలాగే బెల్లం పూర్తిగా కరిగాక, ఇలాచీ పొడి, నెయ్యిలో వేగించిన జీడిపప్పు, కిస్మిస్ లు వేసి కలపాలి. నిమిషం తర్వాత స్టవ్ ఆపేయాలి. కందిపప్పు పాయసం చేయడానికి మరో పద్ధతి కూడా ఉంది. బెల్లాన్ని కందిపప్పుతో పాటు ఉడికించి రుబ్బాలి. దాన్ని వేడి పాలలో కలిపి చేసుకోవచ్చు.

# వరదలు గంగమ్మ తల్లి ఆశీస్సులు.. అవి మిమ్మల్ని స్వర్గానికి తీసుకెళ్తాయ్: మంత్రి వివాదస్పద వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరప్రదేశ్ మత్స్యకార మంత్రి సంజయ్ నిషాద్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. వరదలు గంగమ్మ తల్లి ఆశీస్సులని.. అవి మిమ్మల్ని స్వర్గానికి తీసుకెళ్తాయని వరద బాధితులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి నిషాద్ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతుండగా.. ప్రతిపక్షాలు సదరు అమాత్యుడి కామెంట్స్?పై భగ్గుమంటున్నాయి. బుధవారం (ఆగస్ట్ 6) కాన్పూర్ జిల్లా దేహత్‌లోని వరద బాధిత గ్రామాన్ని అధికారులతో కలిసి మంత్రి నిషాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఓ వరద బాధితుడు మంత్రితో తన గోడు వెళ్లబోసుకున్నాడు. నా ఛాతీ మునిగే లోతు వరకు వరద నీరు ఇంట్లోకి వచ్చిందని.. వరద వల్ల సర్వం కోల్పోయామని బాధ వెళ్లబుచ్చుకున్నాడు బాధితుడు.
దీనిపై మంత్రి నిషాద్ మాట్లాడుతూ.. “మీరు గంగ పిల్లలు.. తన పిల్లల పాదాలను శుభ్రం చేయడానికి తల్లి గంగానే స్వయంగా మీ ఇంటి గుమ్మం వద్దకు వచ్చింది. ఇది మిమ్మల్ని నేరుగా స్వర్గానికి తీసుకెళుతుంది. కొన్నిసార్లు ఆహ్వానించకుండానే గంగమ్మ తల్లి రావడం అదృష్టం. వరదలు గంగమ్మ తల్లి పవిత్ర ఆశీర్వాదాలు” అని బాధితుడికి బదులిచ్చాడు. మంత్రి వ్యాఖ్యలతో చిర్రెత్తిపోయిన అక్కడే ఉన్న ఓ వృద్ధురాలు.. మంత్రికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. వరదలు గంగమ్మ తల్లి ఆశీస్సులు అయితే.. మీరు కూడా ఇక్కడే ఉండి మాతో పాటు గంగమ్మ తల్లి ఆశీస్సులు తీసుకోవాలని సదరు మంత్రి మైండ్ బ్లాంక్ అయ్యే ఆన్సర్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్?గా మారింది.
వరదల్లో సర్వం కోల్పోయి బాధలో ఉన్న బాధితులు తమ గోడు వెళ్లబోసుకుంటే వాళ్లకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. వరదలు గంగమ్మ తల్లి ఆశీస్సులు.. అవి మిమ్మల్ని స్వర్గానికి తీసుకుపోతాయని మంత్రి మతిలేని మాటలు మాట్లాడటంపై ప్రతిపక్షాలు, నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతిపక్ష సమాజ్ వాదీ, కాంగ్రెస్ పార్టీలు మంత్రి నిషాద్ వ్యాఖ్యలపై ఫైర్ అయ్యాయి. వరద బాధితుల పట్ల మంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించాయి. వరద బాధిత ప్రజలకు సహాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మంత్రి వ్యాఖ్యలు ప్రజల మతపరమైన భావాలను తీవ్రంగా కించపరిచాయని విమర్శించారు.

# రాఖీ పండుగ 2025 : అక్కా చెల్లెళ్లకు ఇలాంటి బహుమతులు అస్సలు ఇవ్వొద్దు.. ఎందుకో తెలుసుకోండి బ్రదర్స్..




**హైదరాబాద్ పెన్ పవర్:** హిందువులు మహిళలను మహాలక్ష్మీగా భావించే సంప్రదాయాన్ని పాటిస్తారు. ఈ ఏడాది రాఖీ పండుగ ఆగస్టు9న వచ్చింది. అలాంటి అక్కాచెల్లెళ్లు .. అన్నా తమ్ముళ్లకు.. శ్రావణమాసం పౌర్ణమి రోజున రాఖీ కట్టడం సంప్రదాయంగా వస్తుంటారు. అలానే సోదరులు.. సోదరీమణులకు బహుమతులు ఇస్తుంటారు. కాని జ్యోతిష్యం ప్రకారం .. కొన్ని రకాల గిఫ్ట్స్? ఇస్తే మీ సంబంధాలలో గ్యాప్ పెరిగే అవకాశం ఉందంటున్నారు పండితులు. ఎలాంటి బహుమతులు? ఇవ్వకూడదో ఇప్పుడు తెలుసుకుందాం. . .
గాజు సామాను: రాఖీ పండుగ సందర్భంగా మీ సోదరికి గాజుతో తయారు చేసిన వస్తువులు ఎప్పటికీ బహుమతిగా ఇవ్వకూడదు. అలాంటివి బహుమతిగా ఇచ్చినప్పుడు కిందపడితే పగిలిపోతాయి. ఇలా బహుమతులు బ్రేక్ అవడం అశుభమని భావిస్తారు. గాజు ఎలా బ్రేక్? అయిందో... మీ రిలేషన్? కూడా బ్రేక్? అవుతుందని నమ్ముతారు. అందుకే ఎట్టి పరిస్థితుల్లో గాజుతో తయారు చేసిన సామానులను రాఖీ పండుగ రోజు మీ ఇంటి ఆడపడుచులకు బహుమతిగా ఇవ్వవద్దని పండితులు సూచిస్తున్నారు. పెర్? ఫ్యూమ్స్? : సోదరి... సోదరుల మధ్య సంబంధాలు జీవితాంత కాలం మంచిగా ఉండాలి. పెర్? ఫ్యూమ్స్? వాసన ఒక్కోటి ఒక్కోరకంగా ఉంటుంది. కొంతమంది అసలు వాడరు కూడా. మీరు ఇచ్చే పెర్? ఫ్యూమ్స్? వాడాలని కూడా లేదు. వాటి స్మెల్? ప్రతికూల శక్తినికి కలిగిఉంటుంది... ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇలా పెర్? ఫ్యూమ్స్? వలన ఉపయోగాలు కంటే నష్టాలే ఎక్కువ ఉన్నాయి. అందుకే పెర్?ఫ్యూమ్స్? ను ఎట్టి పరిస్థితిలో రాఖీ పండుగ రోజు బహుమతిగా ఇవ్వవద్దని పండితులు సూచిస్తున్నారు. స్మార్ట్‌వాచ్ (గడియారం):రాఖీ పండుగ వేళ చాలా మంది తమ సోదరీమణులకు సమయం విలువ తెలియాలని, అది ఉంటే తమను కలకాలం గుర్తు పెట్టుకుంటారని భావించి గడియారాలను బహుమతిగా ఇస్తుంటారు. అందులోనూ ప్రస్తుతం స్మార్ట్ వాచెస్ లో అనేక ఫీచర్లు కూడా ఉన్నాయి. దీంతో చాలా మంది వీటిని ఇవ్వడానికే ఆసక్తి చూపుతున్నారు. అయితే శాస్త్రాల ప్రకారం, గడియారం ఆగిపోతే మీ బంధంపై ప్రభావం పడుతుందట. కాబట్టి మీ సోదరీమణులకు వాచ్ లేదా స్మార్ట్ వాచెస్ వంటి వాటిని ఇవ్వకండి.నలుపు రంగువస్తువులు: హిందూ మత విశ్వాసాల ప్రకారం, నలుపు రంగును అశుభకరమైనదిగా పరిగణిస్తారు. ఈ రంగుపై శని దేవుని ప్రభావం ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు.ముఖ్యంగా బ్లాక్ కలర్ డ్రస్సులను అస్సలు ఇవ్వొద్దు.. అందుకే తమ సోదరి భవిష్యత్తు మేలు కోరుకునే సోదరులంతా నలుపు రంగులో ఉండే ఎలాంటి వస్తువులను రాఖీ పండుగ రోజున బహుమతిగా ఇవ్వకండి. ఇంకా రాఖీ పండుగ వంటి పవిత్రమైన రోజున మీ తోబుట్టువులకు పాదరక్షలను బహుమతిగా ఇవ్వకూడదు.

## తెరపైకి మరోసారి పుష్పా-2 తొక్కిసలాట కేసు.. ఆరు వారాల టైమ్ ఇచ్చిన NHRC



**హైదరాబాద్ పెన్ పవర్:** పుష్పా-2 రిలీజ్ సందర్భంగా జరిగిన తొక్కిసలాట కేసు మరోసారి తెరపైకి వచ్చింది. బుధవారం (ఆగస్టు 06) అల్లు అర్జున్ పుష్పా 2 ఈవెంట్‌లో రేవతి మృతి కేసుపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ స్పందించింది. ఈవెంట్‌కు పోలీసుల అనుమతి లేకపోయినప్పటికీ ప్రజలను అనుమతించడంపై కమిషన్ ప్రశ్నించింది. ప్రజల భద్రతకై ముందస్తు చర్యలు తీసుకోలేదని పోలీసులపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో రేవతి మృతి కేసులో అల్లు అర్జున్, థియేటర్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీపై కేసు నమోదైన విషయం తెలిసిందే. క్రైమ్ నం. 376/2024 కింద మొత్తం 10 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే సంఘటన ముందే ఊహించదగ్గదే అయినా.. ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని పోలీసులపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రేవతి కుటుంబానికి 5 లక్షల రూపాయల పరిహారం చెల్లించాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ అంశంపై ఆరు వారాల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని పోలీసు కమిషనర్‌ను ఆదేశించింది.

## నల్ల తేలు యమ డేంజర్... ఒక్క కాటుతో 25 రకాల విషాలు ఎక్కుతాయట!

**హైదరాబాద్ పెన్ పవర్:** తేలు కుట్టింది కదా అని తేలిగ్గా తీసుకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా తూర్పు, దక్షిణ భారతదేశ అడవుల్లో కనిపించే నిగనిగలాడే నల్ల తేలు కాటు అత్యంత ప్రమాదకరమని తాజా పరిశోధనలో తేలింది. ఈ తేలు కుట్టినప్పుడు ఒకేసారి 25 రకాల ప్రాణాంతక విష రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి కాలేయం, రోగనిరోధక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని గువాహటికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు కనుగొన్నారు.సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి చెందిన ఈ స్వయంప్రతిపత్తి సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆశిష్. కె. ముఖర్జీ, రీసెర్చ్ స్కాలర్ సుస్మితా నాథ్ నేతృత్వంలో ఈ అధ్యయనం జరిగింది. మన దేశంలో ఈ నల్ల తేలు కాటు కేసులు ఎక్కువగా ఉన్నప్పటికీ, దీని విషంపై ఇప్పటివరకు పెద్దగా శాస్త్రీయ అధ్యయనాలు జరగలేదని వారు తెలిపారు. ఈ లోటును పూడ్చేందుకే తాము పరిశోధన చేపట్టినట్లు వివరించారు.స్పెక్ట్రోమెట్రీ, బయోకెమికల్ విశ్లేషణల ద్వారా ఈ తేలు విషంలో 8 విభిన్న ప్రొటీన్ కుటుంబాలకు చెందిన 25 కీలక విష రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషం ఎంత ప్రమాదకరమో తెలుసుకునేందుకు స్విస్ అల్బినో జాతి ఎలుకలపై ప్రయోగించారు. విషం ఎలుకల శరీరంలోకి ప్రవేశించిన వెంటనే వాటి కాలేయానికి సంబంధించిన ఎంజైమ్‌ల స్థాయులు విపరీతంగా పెరిగాయని, కీలక అవయవాలు దెబ్బతిన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు.“విషం శరీరంలోకి చేరగానే ఒక రకమైన విష తుపానును సృష్టించింది. ముఖ్యంగా రోగనిరోధక వ్యవస్థ అసాధారణ రీతిలో స్పందించింది. ఇది నిజ జీవితంలో మనుషులకు తేలు కుట్టినప్పుడు షాక్ లేదా తీవ్రమైన అలర్జీలకు దారితీసే ప్రమాదం ఉందని సూచిస్తోంది” అని పరిశోధకులు తెలిపారు. ఈ అధ్యయన వివరాలు ‘ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ బయోలాజికల్ మాక్రోమ్యాక్యుల్స్’లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధన తేలు కాటుకు మెరుగైన చికిత్సా విధానాలను అభివృద్ధి చేయడానికి భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# సృష్టి కేసులో మరో సంచలనం.. సరోగసి పేరుతో 80 మంది పిల్లలను విక్రయించిన డాక్టర్ నమ్రత

**హైదరాబాద్ పెన్ పవర్:** సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో తవ్వేకొద్ది సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో తాజాగా మరో షాకింగ్ విషయాన్ని గుర్తించారు పోలీసులు. సరోగసి పేరుతో 80 మంది పిల్లలను విక్రయించినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. పిల్లలను అమ్ముకున్నట్టు నిందితురాలు డాక్టర్ నమ్రత కూడా అంగీకరించారని పోలీసులు వెల్లడించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి పిల్లలను సేకరించామని.. అందరికీ డబ్బులు ఇచ్చే పిల్లలను కొనుగోలు చేశామని డాక్టర్ నమ్రత చెప్పిందన్నారు. అయితే, పిల్లలను కొనుగోలు చేసిన ఏజెంట్ల వివరాలు మాత్రం లేవని డాక్టర్ చెప్పారని పోలీసులు తెలిపారు.






80 మంది పిల్లల తల్లిదండ్రుల వివరాలపై ఆరా తీసేందుకు డాక్టర్ నమ్రతను మరోసారి కస్టడీకి ఇవ్వాలని గోపాలపురం పోలీసులు కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో గోపాలపురం పోలీసులు ఇప్పటికే 17 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి ఓ సారి కస్టడీకి కూడా తీసుకుని విచారించారు. తాజాగా 80 మంది పిల్లల వ్యవహారం బయటపడటంతో ఆ వివరాలు రాబట్టేందుకు ఆమెను మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు పోలీసులు.

కాగా, సరోగసీ పేరుతో పేద దంపతుల నుంచి శిశువులను తక్కువ రేటుకు కొని.. సంతానం లేని వారికి లక్షల్లో అమ్ముకున్న సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకుల అరాచకాలు పోలీసుల దర్యాప్తుతో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. సికింద్రాబాద్ చుట్టుపక్క ప్రాంతాల్లో, రైల్వే స్టేషన్ ఫుట్ పాత్?లపై ఉన్న బిచ్చగాళ్లకు బీరు, బిర్యానీ ఆఫర్ చేసి వారి నుంచి వీర్యం సేకరించినట్టు తెలుస్తున్నది. వీర్యం తీసుకునేప్పుడు వారికి పోర్న్ వీడియోలు చూపించేవారని సమాచారం.

దర్యాప్తులో భాగంగా నార్త్ జోన్ గోపాలపురం పోలీసులు.. సృష్టి క్లినిక్ నుంచి పెద్ద సంఖ్యలో ఐవీఎఫ్, సరోగసీ కేసుల రికార్డులు, ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తున్నది. దాదాపు 200 మంది దంపతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు సమాచారం. ఐవీఎఫ్, సరోగసీ ఐవీఎఫ్ ట్రీట్మెంట్ తీసుకున్న దంపతులకు పోలీసులు ఫోన్లు చేస్తూ వివరాలు సేకరిస్తున్నారు. కొందరు ఫోన్ కాల్స్ కు స్పందించడం లేదని సమాచారం. సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్?కు సిటీలో కూకట్?పల్లి, కొండాపూర్ ప్రాంతాల్లో బ్రాంచీలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే, ఏపీలోని విజయవాడ, వైజాగ్ తో పాటు ఒడిశా, కోల్?కతాలోనూ బ్రాంచీలు ఉన్నట్లు సమాచారం.

# ట్రంప్ టారిఫ్ లపై భారత పారిశ్రామిక వర్గాలు ఏమంటున్నాయి?

- భారత ఉత్పత్తులపై అమెరికా 25% సుంకాలు
- ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానున్న టారిఫ్‌లు
- జీడీపీపై కేవలం 0.19% మాత్రమే ప్రభావం అంచనా
- ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగాలపై అధిక ప్రభావం
- ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పారిశ్రామిక వర్గాల ప్రత్యేక వ్యూహం
- సవాలును అవకాశంగా మార్చుకోవాలని నిపుణుల సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా అదనపు సుంకాలు విధించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం మేర సుంకాలు (టారిఫ్‌లు) విధించనున్నప్పటికీ, దానివల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం చాలా పరిమితంగానే ఉంటుందని ప్రముఖ పరిశ్రమల సమాఖ్య పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల దేశ జీడీపీపై కేవలం 0.19 శాతం మేరకే ప్రభావం ఉంటుందని బుధవారం విడుదల చేసిన ఒక నివేదికలో అంచనా వేసింది.

ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానున్న ఈ సుంకాల వల్ల అమెరికాకు భారత్ నుంచి వెళ్లే సుమారు 8.1 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై ప్రభావం పడనుంది. ఇది భారతదేశ మొత్తం అంతర్జాతీయ వాణిజ్య ఎగుమతుల్లో 1.87 శాతానికి సమానమని పీహెచ్‌డీసీసీఐ తెలిపింది. తమ విశ్లేషణ ప్రకారం, స్థూల ఆర్థిక స్థాయిలో ఈ ప్రభావం నిర్వహించదగినదేనని పేర్కొంది.

అమెరికా విధించనున్న ఈ టారిఫ్‌ల వల్ల ప్రధానంగా ఇంజనీరింగ్ వస్తువులు (1.8 బిలియన్ డాలర్లు), ఎలక్ట్రానిక్ వస్తువులు (1.4 బిలియన్ డాలర్లు), ఫార్మాస్యూటికల్స్ (986 మిలియన్ డాలర్లు), రత్నాలు, ఆభరణాలు (932 మిలియన్ డాలర్లు), రెడీమేడ్ దుస్తులు (500 మిలియన్ డాలర్లు) వంటి రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదిక వివరించింది. ఈ సుంకాల ప్రభావాన్ని అధిగమించేందుకు పీహెచ్‌డీసీసీఐ నాలుగు సూత్రాల వ్యూహాన్ని ప్రతిపాదించింది. అమెరికాలోని ప్రముఖ రిటైలర్లతో చర్చించి, మెరుగైన ధరలకు ఒప్పందాలు కుదుర్చుకోవడం, ఐరోపా సమాఖ్య (ఈయూ), కెనడా, లాటిన్ అమెరికా వంటి కొత్త మార్కెట్లపై దృష్టి సారించడం వంటివి ఈ వ్యూహంలో భాగమని తెలిపింది. పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు హేమంత్ జైన్ మాట్లాడుతూ, “ఈ సుంకాల సవాలు, ఎగుమతులను మరింత మెరుగుపరచుకోవడానికి, భౌగోళికంగా వైవిధ్యభరితమైన మార్కెట్లను అన్వేషించడానికి భారత్‌కు ఒక అవకాశాన్ని అందిస్తోంది” అని అన్నారు. సమాఖ్య సీఈవో రంజీత్ మెహతా స్పందిస్తూ, “దేశీయంగా ఉన్న బలమైన డిమాండ్, వైవిధ్యభరితమైన ఆర్థిక వ్యవస్థ కారణంగా భారత్ ఈ సవాలును తట్టుకోగలదు. ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవాలి” అని వ్యాఖ్యానించారు. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం, 2025లో భారత జీడీపీ 6.4 శాతం వృద్ధితో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని నివేదిక గుర్తుచేసింది.